## క్లుప్తంగా

### అంకమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అంకమ్మ

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువైన అంకమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగి సేవ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు. భక్తుల రద్దీతో అంకమ్మ కొండ కోలాహలంగా మారింది,

### కొత్త వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వండి



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ కిశోర్‌బాబు

గూడూరు రూరల్ : కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గూడూరు రూరల్ సీఐ కిశోర్‌బాబు సూచించారు. గూడూరు రెండవ పట్టణంలోని అడివయ్య కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేని ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. శివారు ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు నివాసాలు ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఎవరైనా కొత్తవారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటి, రెండో పట్టణ సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, గూడూరు రూరల్, చిల్లకూరు స్టేషన్‌ల ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సత్ప్రవర్తన కలిగి ఉండాలి



కౌన్సిలింగ్ ఇస్తున్న గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్

గూడూరు రూరల్ : ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఆదివారం గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీట్ ఉన్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో నేర చరిత్ర ఉన్నా అలాగే ఉంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. అలా కాకుండా ఎవరికి వారు తమకు నచ్చిన పని చేసుకుంటూ కుటుంబాలతో సంతోషంగా ఉంటే రౌడీ షీట్లను ఎత్తి వేస్తామన్నారు. ఎక్కడైనా అల్లర్లు సృష్టించడం, గొడవలు పడడం లాంటివి చోటుచేసుకుంటే వెంటనే జైలుకు పంపుతామన్నారు.

### దుప్పట్ల పంపిణీ



నిరాశ్రములకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని అడివయ్య కాలనీలో ఉన్న అనాథ శరణాలయంలోని నిరాశ్రయులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు కూరపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో విశ్రాంత మేనేజర్ లారెన్స్ జ్ఞాకార్థం వారి కుటుంబ సభ్యులు దుస్తులు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బాషా జాన్ పాల్, సంస్థ బాధ్యులు యశ్వంత్, రహంతుల్లా, బాషా తదితరులు పాల్గొన్నారు.

### పిల్లర్లకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం



సిద్ధాపురం పాఠశాల ఆవరణలో పిల్లర్ల దశలోనే ఆగిన అంగన్‌వాడీ కేంద్రం భవనం

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం పంచాయతీ సిద్ధాపురం ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణం పదేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది. దీంతో చేసేదేమీలేక అంగన్‌వాడీ సిబ్బంది స్థానికంగా ఉన్న 15 మంది పిల్లలను ప్రాథమిక పాఠశాలలోని వరండాలోనే కూర్చోబెట్టి విద్యను అందిస్తున్నారు. వర్షాకాలంలో పలు ఇబ్బందుల మధ్య కేంద్రాన్ని నడపాల్సి వస్తోందని గిరిజనులు, నిర్వాహకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# దర్జాగా ప్రభుత్వ భూముల కబ్జా

**అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక, మట్టి, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ప్రస్తుతం వారి కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. జాతీయ రహదారి వెంబడి ఉన్న రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు భారీ ముడుపులు తీసుకుని చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ భూములన్నీ అన్యాక్రాంతమవుతాయని స్థానికులు వాపోతున్నారు.**



టోల్‌ప్లాజా పక్కనే ప్రభుత్వ భూమిలో నాటిన జామాయిల్ మొక్కలు

- ఎకరా రూ.కోటి వరకు విక్రయం
- ఆరు నెలల ముందు బోర్డు ఏర్పాటు.. రాత్రికి రాత్రే తొలగింపు
- ముడుపులు తీసుకుని ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరులో ఉన్న నిమ్మకాయల మార్కెట్‌తోపాటు రైల్వే జంక్షన్ కావడంతో పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. చిల్లకూరు కూడా పట్టణంలోకి కలిసిపోయింది. దీనికితోడు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి గ్రామానికి దగ్గరగా వెళుతుండడంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా రూ.కోటి నుంచి రెండు కోట్ల వరకు పలుకుతోంది. చిల్లకూరు మండలం కడివేడు రెవెన్యూ పరిధిలోని బూదనం నుంచి పత్రగుంట వరకు జాతీయ రహదారి వెంబడి ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిపై కన్నేసిన కూటమి నేతలు పేదలను అడ్డు పెట్టుకుని ఆక్రమించుకున్నారు. అనంతరం అగ్రిమెంట్ల మీద వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులు మాట్లాడకుండా ఉండేందుకు భారీగా ముడుపులు ఇచ్చినట్టు సమాచారం.

**బూదనం టోల్ ప్లాజా సమీపంలో...**

కడివేడు రెవెన్యూ పరిధిలోని బూదనం టోల్ ప్లాజా కు పక్కనే సర్వే నెంబర్ 953లో సుమారు 17 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారి విస్తరణలో సుమారు ఐదు ఎకరాల వరకు సేకరించారు. మిగిలిన భూమిని కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కించడంతో పలువురు వీటిని ఆక్రమించుకుని క్రయ విక్రయాలు చేసేశారు.

**ఫెన్సింగ్ వేసి జామాయిల్ సాగు**

టోల్ ప్లాజాను ఆనుకుని ఉన్న సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును అధికారులు తొలగించడమే తరువాయి ఆక్రమణదారులు దాన్ని దర్జాగా కబ్జా చేసి చుట్టూ పెన్సింగ్ వేశారు. దీనిపై స్థానికులు వీఆర్వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళితే పరిశీలిస్తామని చెప్పి మాట దాట వేయడం పరిపాటిగా మారింది. దీంతో ఆక్రమణదారులు మరో అడుగు ముందుకు వేసి ఆ భూమిలో ఇటీవల జామాయిల్ మొక్కలు నాటారు. ప్రస్తుతం ఈ భూమి విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుంది. ఇంత విలువైన ప్రభుత్వ భూమిని ధారాదత్తం చేయడాన్ని బట్టి అధికారులకు భారీగానే ముడుపులు అందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

**బోర్డులు పెట్టి తొలగించారు**

స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో రెండు చోట్ల వీఆర్వో సర్వే నంబర్లను తెలియజేస్తూ భూమి ఎంత విస్తీర్ణం ఉందనే విషయాలు తెలిసేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తర్వాత రాత్రికి రాత్రే ఒక బోర్డును తొలగించారు. దాన్ని ఆ ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కడివేడు సచివాలయం వెనుక దాచి పెట్టారు. ఆ భూమిని ఆక్రమణదారులకు అప్పగించేందుకు బోర్డును తొలగించారని, ఇందుకోసం భారీ స్థాయిలో ముడుపులు తీసుకున్నట్టు సమాచారం.



కడివేడు సచివాలయం వెనుక భద్రపరిచిన హెచ్చరిక బోర్డు

**భూములను పరిశీలిస్తాం..**

కడవేడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 953లో ఉన్న పభుత్వ భూములను గతంలోనే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశా. ఇటీవల మళ్లీ ఆ భూములను ఆక్రమించుకుని సాగు చేసినట్లు సమాచారం అందింది. తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో ఏర్పాటు కానున్న క్రిస్ సిటీ భూ సేకరణ పనిలో ఉండిపోవడంతో కడివేడు భూములపై దృష్టి పెట్టలేదు. ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసులు, తహసీల్దార్, చిల్లకూరు

# బలిజ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని బలిజ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఆరుగురు విద్యార్థులకు నెల్లూరులోని కాపు భవన్‌లో ఆదివారం మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మీ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో నగదు ప్రోత్సాహం అందజేస్తున్నట్టు తెలిపారు. ఆరుగురు విద్యార్థుల్లో నలుగురికి రూ.10 వేల చొప్పున, ఇద్దరికి రూ.2,500 చొప్పున అందజేశామన్నారు. పేద బలిజ విద్యార్థులు తమ ఆర్థిక స్థితిని సంఘం దృష్టికి తీసుకువస్తే సాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి సువర్ణలక్ష్మీ, ఉమాదేవి, ఉషా, అరుణ, జ్యోతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు

## ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సైదాపురం : మండలంలోని ఊటుకూరు గ్రామ శివారులో ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసినట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.5,920లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

## కండలేరులో 46.740 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 46.740 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 9,900 క్యూసెక్కుల నీరు చేరుతోందని వెల్లడించారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1300, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 125, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కుటుంబ సభ్యులకు వివాహిత అప్పగింత

వెంకటగిరి రూరల్ : దీపావళి పండుగ కోసమని పుట్టింటికి బయలుదేరి అదృశ్యమైన వెంకటగిరి రూరల్ మండలానికి చెందిన వివాహిత పెంచలమ్మ ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఆమె బుధవారం భర్తతో కలిసి ఇంటి నుంచి బయలుదేరి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. వెంకటగిరి పోలీసులు ముమ్మరంగా గాలించారు. రాజంపేటలో ఉన్నట్టు గుర్తించి వెంకటగిరికి తీసుకువచ్చారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# భూమనకు నేదురుమల్లి అభినందనలు

వెంకటగిరి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన భూమన కరుణాకరరెడ్డికి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆయన తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా భూమనను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అభినందించారు.



భూమన కరుణాకర్‌రెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

# అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యం

- నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు
- మేనకూరు ఎన్‌టీఆర్ కాలనీలో కార్డన్ సెర్చ్

నాయుడుపేట టౌన్ : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నాయుడుపేట మండలంలోని మేనకూరు ఎన్‌టీఆర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ చేపట్టారు. ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. పరిశ్రమల్లో పని చేసేందుకు వచ్చిన యూపీ, ఎంపీ, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికుల ఆధార్ కార్డులను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కాలనీలో ఎవరి మీదైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తుకు బానిసలు కావొద్దన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌ల ఎస్‌ఐలు శ్రీహరిబాబు, నాగరాజు, అజయ్‌కుమార్, ఏఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



మేనకూరు ఎన్‌టీఆర్ కాలనీలో ఇతర రాష్ట్రాల వారితో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

# కూటమి పాలనలో పెరిగిన హత్యలు, లైంగిక దాడులు

- ఎస్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు : కూటమి ప్రభుత్వ పాలనలో హత్యలు, లైంగిక దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, రాష్ట్రం రావణకాష్టంగా మారిపోయిందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం పుల్లూరులో విలేకరులతో మాట్లాడారు. వడమాలపేట మండలం ఏఎం పురంలో చిన్నారిని కామాంధుడు బలి తీసుకోవడం అన్యాయమన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఐదు నెలల పాలనలోనే రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో అమలు చేసిన దిశా చట్టంతో మహిళలకు పూర్తి భద్రత కలిగిందని, కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడంతోనే అఘాయిత్యాలు పెరిగాయని విమర్శించారు. ఆడబిడ్డలకు కష్టం వస్తే ముందుండి పోరాడతామన్నా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. నాయకులు మణినాయుడు, భాస్కర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గోపి, శివ, శంకరయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

# మృతుని కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

చిల్లకూరు : గూడూరు రెండవ పట్టణ సమీపంలోని పరిశ్రమలో శనివారం మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గోపీకృష్ణ షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడని అన్నారు. పరిశ్రమలో మిషనరీ పూర్తిగా తుప్పపట్టినప్పటికీ మార్చకపోవడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే కార్మికుడు గోపీకృష్ణ మృతి చెందాడని ఆరోపించారు. గతంలో కూడా ఎంతో మంది కాళ్లు, చేతులు కోల్పోయారని, పలువురు మృత్యువాత పడ్డారని తెలిపారు. యాజమాన్యం రూ.50 లక్షల పరిహారం ఇచ్చి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ఎస సురేష్, పీ శ్రీనివాసులు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

# నిత్యాన్నదానానికి రూ.1.11 లక్షల విరాళం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి మర్లపల్లి గ్రామస్తులు ఆదివారం రూ.1,11 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్ మాట్లాడుతూ మర్లపల్లికి చెందిన పెనగలూరు సుబ్బరామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు లీలావతమ్మ, జమున, దువ్వూరు విజయలక్ష్మీ, ఎర్రంరెడ్డి అనసూయమ్మ విరాళం ఇచ్చారని పేర్కొన్నారు. కార్యాక్రమంలో పెనగలూరు కృష్ణస్వరూప్‌రెడ్డి, వంశీకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగదును ఆలయం ధర్మకర్తకు అందజేస్తున్న దాతలు

# 683 ఎకరాల మాన్యాలున్నా ఆలన కరువు

**ఒకప్పుడు ఆ ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు జరిగేవి. భక్తులతో కిటకిటలాడేది. ఆ స్వామిని మొక్కితే కోర్కెలు నెరవేరతాయనే భక్తుల నమ్మకం. పాలకుల నిర్లక్ష్యంతో ఆలయం ప్రాభవాన్ని కోల్పోయింది. నిత్య పూజలు ఆగిపోయాయి. ఆలయానికి 683 ఎకరాల మాన్యం భూములు ఉన్నా దూపదీప నైవేద్యాలు సైతం కరువయ్యాయి. ఆలయం శిథిలావస్థకు చేరినా పట్టించుకునే దిక్కులేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేటలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ దుస్థితిపై ప్రత్యేక కథనం.**

- కన్నయ్యకు దక్కని దూపదీప నైవేద్యాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు
- నాలుగేళ్లుగా ఊసేలేని పాలక వర్గం



బంగారుపేట వేణుగోపాలస్వామి ఆలయం

వెంకటగిరి రూరల్ : వందల సంవత్సరాల క్రితం వెంకటగిరిరాజాల హయాంలో బంగారుపేటలో వేణుగోపాల స్వామి ఆలయం నిర్మించారు. దీని ఆలనా పాలనకు బాలాయపల్లి మండలంలోని కయ్యూరు వేణుగోపాలపురం, కనందనాలపాడు, జంగాలపల్లి, యాసముద్రం గ్రామాల్లో సుమారు 800 ఎకరాల మాన్యం భూమి కేటాయించారు. గతంలో భూముల ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయ నిర్వహణ చేపట్టేవారు. మంచి జరుగుతుందన్న విశ్వాసంతో ఆలయంలో వివాహాది శుభకార్యాలు చేసుకోవడానికి భక్తులు పోటీపడేవారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా క్రమేణా ఆలయం పాలన కుంటుపడుతూ వచ్చింది. మాన్యం భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. భూములను కౌలుకు తీసుకున్న కొంతమంది భూ స్వాములు శిస్తులు కట్టకుండా వదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రాజకీయ పలుబడితో అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుని భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వేణుగోపాలపురంలో ఉన్న భూములను ఆక్రమించుకుని నిమ్మ తోటలు సాగు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములను ఏడాదికి ఒకసారి వేలం పాటలు నిర్వహించి కౌలుకు అప్పగించాల్సి ఉంది. తద్వారా వచ్చే ఆదాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. వేణుగోపాల స్వామి ఆలయ భూములను వేలం వేయకుండానే కొంతమంది రాజకీయ పెత్తందార్లు సొంతం చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వారు సక్రమంగా శిస్తులు చెల్లించడం లేదని, అందువల్లే ఆలయ నిర్వహణ లేదని ప్రజలు వాపోతున్నారు.

**ఆలయ భూములు వివరాలు...**

బంగారుపేట వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించి బాలాయపల్లి మండలంలో కయ్యూరు వేణుగోపాలపురంలో సర్వే నంబర్ 180ఏ, 150, 154,155, 157లో సుమారు 803.30 ఎకరాలు భూములు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారుల రికార్డుల్లో మాత్రం కయ్యూరు వేణుగోపాలపురంలో సర్వే నంబర్ 154లో 75.75 ఎకరాలు, 155లో 65.40 ఎకరాలు, 156లో 34.80 ఎకరాలు, 157/2లో 497.84 ఎకరాలు, జంగాలపల్లిలో సర్వే నంబర్ 98/5లో 3.92 ఎకరాలు, 99/5లో 2.84 ఎకరాలు, 105/22లో 0.44 ఎకరాలు, కందనాలపాడులో సర్వే నంబర్ 9/1లో 3.50 ఎకరాలు, యాచవరంలో 41/2లో 2.44 ఎకరాల భూములు ఉన్నాయి.

**నాలుగేళ్లుగా ఏర్పాటుకాని ఆలయ కమిటీ**

బంగారుపేట రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం దేవదాయ శాఖలో విలీనమైంది. ఆలయం పరిపాలన, అభివృద్ధి, ఆస్తులకు సంబంధించిన నిర్వహణ కోసం రెండేళ్ల కాలపరిమితితో కమిటీని నియమించాల్సి ఉంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల నాలుగేళ్ల నుంచి కమిటీ ఏర్పాటు ఊసేలేదు. దీంతో ఆలయ అభివృద్ధి మరింత కుంటుపడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**పూర్వవైభవం తీసుకురావాలి**



వేణుగోపాల స్వామి ఆలయానికి వందల ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఏడాదికి రూ.లక్షల ఆదాయం వస్తోంది. అదంతా ఎక్కడికి పోతోందో తెలియడం లేదు. ఆలయ పరిపాలన, దూప దీప నైవేద్యాలు కరువయ్యాయి. అధికారులు, పాలకులు స్పందించి ఆలయాన్ని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలి.

– యారాసి నాగేశ్వరరావు, ఆలయ మాజీ చైర్మన్, బంగారుపేట

**ఆలయ భూములపై సమగ్ర విచారణ చేయాలి**



వేణుగోపాలస్వామి ఆలయ నిర్వణ మొక్కుబడిగా జరుగుతోంది. ఆలయానికి సంబంధించి భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిపై అధికారులు, ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలి. శిస్తు బకాయిలను వసూలు చేసి ఆలయ అభివృద్ధికి ఖర్చు పెట్టాలి. పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– కూనా మల్లికార్జున్‌రావు, బంగారుపేట, వెంకటగిరి

**పూజలు జరిపిస్తున్నాం**

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రతిరోజూ పూజలు చేయిస్తున్నాం. ఆలయ మాన్యం భూముల్లో కయ్యూరు వేణుగోపాలపురంలో ఉన్న సర్వే నంబర్ 157/2లో 494.05 ఎకరాలు అటవీశాఖ భూమిగా రికార్డులో ఉంది. ఈ మేరకు ఉమ్మడి సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. సర్వే అనంతరం ఆలయం భూములపై దృష్టిసారిస్తాం. ప్రస్తుతం సాగులో ఉన్న మాన్యం భూముల నుంచి వచ్చే నిధులతో ఆలయ నిర్వహణను కొనసాగిస్తున్నాం.

– అరవభూమి వెంకటేశ్వర్లు, గ్రూపు ఆలయాల ఈవో

## ఇంగ్లీషు సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు ఉపాధ్యాయుడి ఎంపిక



దూడల పెంచలయ్య

దక్కిలి : ఈ ఇంగ్లీషు సర్టిఫికెట్ కోర్సుకు దక్కిలి మండలం వెల్లంపల్లి ఎస్టీకాలనిలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దూడల పెంచలయ్య ఎంపికైనట్టు ఎంఈవో కిల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇంగ్లీషును సులభంగా బోధించేందుకు ఈ కోర్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ మేరకు దక్షిణ భారతదేశం నుంచి ఒక్కో రాష్ట్రానికి 25 మంది ఉపాధ్యాయుల చొప్పున ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో తిరుపతి జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. దక్కిలి మండలం నుంచి దూడల పెంచలయ్య, పెళ్లకూరు మండలం నుంచి బాలసుబ్రమణ్యం ఎంపికయ్యారని వెల్లడించారు. వారు బెంగళూరులో ఉన్న రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు సౌత్ ఇండియా జ్ఞాన భారతి క్యాంపస్‌లో 30 రోజుల శిక్షణలో పాల్గొంటారని పేర్కొన్నారు.